పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మద్దతు కోరుతూ హైదరాబాద్ ఎంపీ ఓవైసీతో దారుసలాంలో గురువారం సమావేశమై చర్చించారు. బీసీ బిల్లు పెట్టేలా మజ్లిస్ పార్టీ చూపాలని కోరారు. మజ్లిస్ తరపున బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ప్రైవేటు బిల్లు పెడతామని ఓవైసీ హామీ ఇచ్చారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

ఎస్సీఆర్ ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్

మారేడ్‌పల్లి, జూలై 11 కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంత వరకు కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అండ్రూస్ స్పష్టం చేశారు. గురువారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్ ఎదురుగా ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రైల్వే మంత్రులు, బోర్డు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. జోనల్ సెక్రటరీ భరణి భాను ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని నిద్ర లేపేందుకు ఈ ధర్నా చేపట్టామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎస్ రుద్రారెడ్డి, షేక్ రవూఫ్, నాయకులు ప్రసాద్, ప్రభురాజ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జనగామ బీఆర్ఎస్ ఆఫీస్‌కు నోటీసులు

15 రోజుల్లో ఆధారాలివ్వాలన్న రెవెన్యూ అధికారులు

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ జనగామ జిల్లా కార్యాలయ ఆధీనంలో అదనంగా 20 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉన్నదని కలెక్టర్ గురువారం సాయంత్రం లీగల్ నోటీసులు జారీ చేశారు. జనగామ మండలం యశ్వంతాపూర్ రెవెన్యూ గ్రామంలోని సర్వేనంబర్ 82లో ఎకరం భూమిని టీఆర్ఎస్ భవనం కోసం కేటాయించారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 82/16, 82/17, 82/18, 82/19 సర్వే నంబర్లలో 20 గుంటల భూమి అదనంగా పార్టీ కార్యాలయ స్వాధీనంలో ఉన్నదని రెవెన్యూశాఖ గుర్తించినట్టు నోటీసులో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి ఆధారాలుంటే 15 రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు.

గిరిజనుడిపై పోలీసుల దాష్టీకం

- ఎమ్మెల్యేను ప్రశ్నించాడని తొర్రూరు ఎస్సై జులుం
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్ట్ చేయడమే నేరమా?
- పోలీసులు తీరును తప్పుపట్టిన కేటీఆర్.. డీజీపీకి సూచనలు
- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: హరీశ్‌రావు
- ఎమ్మెల్యే పీఏ ప్రోద్బలంతోనే కొట్టారు: బాధితుడు సురేశ్‌బాబు
- 50 ఏండ్లు కాంగ్రెస్ జెండా మోసిన ఫలితమిది అని ఆవేదన
- ఎస్సై, ఎమ్మెల్యే పీఏపై అట్రాసిటీ కేసు పెట్టాలి: ఎల్‌హెచ్‌పీఎస్

తనపై దాడి ఘటన తీరును వివరిస్తున్న సురేశ్‌బాబు

తొర్రూరు/హైదరాబాద్ జూలై 11 (నమస్తే తెలంగాణ): పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినీరెడ్డి గెలుపుకోసం రాత్రీపగలు కష్టపడ్డాడా గిరిజన యువకుడు. ఆమె గెలవాలని ఎర్రబెల్లి దయాకర్‌రావుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులూ పెట్టాడు. అతడు కోరుకున్నట్టే యశస్వినీరెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. కానీ, ఇప్పుడు ఆమెకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని ఆ యువకుడిని పోలీసులతో దారుణంగా కొట్టించారు. వివరాల్లోకెళితే.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంలో ఎమ్మెల్యే వెంట ఆమె పీఏలు విజయేందర్‌రెడ్డి, రాజేశ్ తదితరులు సీఎంతో ఫొటోలు దిగారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం భోజ్యతండా పరిధి ఈదులకుంట తండాకు చెందిన మాలోత్ సురేశ్‌బాబు (ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు, ఆమ్‌ఆద్మీపార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు) వాటిపై పలు కామెంట్లు పెట్టాడు. 'స్థానిక లీడర్లను పక్కన పెట్టి పీఏలతో రాజకీయాలు తగునా? విజయేందర్‌రెడ్డి పీఏనా? లేకుంటే రెడ్డిరాజ్యంలో దగాకోరు రెడ్డినా? సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పాలకుర్తి అభివృద్ధి కోసం నిధులు కావాలని కోరినప్పుడు విజయేందర్‌రెడ్డి అనే వ్యక్తిని కాకుండా నియోజకవర్గంలో ఉన్న ఏ చిన్న ఓటరును పిలిచినా నిధులు దేనికి అవసరమో చెప్పేవాళ్లు. సీఎం ముందు ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల పరువు తీస్తున్నారు. అసలు పాలకుర్తిలో ఎమ్మెల్యే ఎవరు? నాయకులు ఎవరు? కార్యకర్తలు ఎవరు? నియోజకవర్గ అభివృద్ధి కోసం పీఏలు సైతం సీఎం కలుస్తారా? అసలు నిధులు దేనికి కావాలని అడిగారో నియోజకవర్గ ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంది. అమ్మ అమెరికా నుంచి ఒక్కరిగా వచ్చి, ఇక్కడ గెలిచి మళ్లీ బ్యాగులు, మూటలు ఆమెరికాకు తీసుకెళ్లే ప్రయత్నం ఏమైనా చేస్తున్నారా?' అని ప్రశ్నించాడు. ఈ పోస్ట్‌పై సురేశ్‌బాబును ఎమ్మెల్యే అనుచరులు, పీఏ విజయేందర్‌రెడ్డి పిలిచి ప్రశ్నించినట్టు తెలిసింది. అతడు ఇంకా బలంగా వాదన చేయటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని పలువురు చెప్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రం సురేశ్‌నాయక్‌ను స్థానిక ఎస్సై జగదీశ్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టారని ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పీఏ విజయేందర్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఎస్సై తీవ్రంగా కొట్టి భయభ్రాంతులకు గురి చేశారని బాధితుడు, అతడి తల్లిదండ్రులు పద్మ, శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కోసం పనిచేస్తే దక్కిన ఫలితమిది

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పీఏ విజయేందర్‌రెడ్డి నియంతలా ఒంటెద్దు పోకడలు పోతున్నాడు. తనే రూల్ చేస్తున్నాడు. ఇక్కడ రెడ్డి పాలన కొనసాగుతున్నదన్న అనుమానం కలుగుతున్నది. ఆయనపై చర్యలు తీసుకోవాలి. మీ(ఎమ్మెల్యే) గెలుపు కోసం పనిచేసిన ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని మీకు తెలిసేలా సోషల్ మీడియాలో పోస్టు చేశాను. దీనిపై వారి మనోభావాలు దెబ్బతిన్నాయని విజయేందర్‌తోపాటు కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై జగదీశ్ నానాబూతులు తిట్టి తీవ్రంగా కొట్టారు. కేసు పెడితే జైలుకైనా పోయేవాన్ని. కానీ ఇలా కొట్టిస్తే మీ పార్టీకే నష్టం. మా కుటుంబం గత 40-50 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ, సేవ చేస్తున్నం. నేను పెట్టిన పోస్టుపై ఇబ్బంది అనిపిస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధపడిన. పోలీసులకు చెప్పి నా ఫోన్లు లాక్కుని నా పర్సనల్ డాటాను చెక్ చేశారు. స్టేషన్‌లో విజయేందర్‌రెడ్డి నన్ను, నా తండ్రిని నానాబూతులు తిట్టారు. తెలంగాణ కోసం ఉద్యమించా. యశస్వినీరెడ్డి గెలుపు కోసం పనిచేశా. దయాకర్‌రావును ఓడగొట్టి, యశస్వినీరెడ్డిని గెలిపించేందుకు దయాకర్‌రావుపై సోషల్‌మీడియాలో ఇష్టం వచ్చినట్టు దుష్ప్రచారాలతో పోస్టులు పెట్టా. నేనేం తప్పు చేశానని ఇలా కొట్టించారు. 8 నెలల్లోనే ఇన్ని ఘోరాలు చూస్తానని అనుకోలేదు. వెంటనే నన్ను కొట్టిన ఎస్సై, కొట్టించిన విజయేందర్‌రెడ్డిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నా.

- బాధితుడు సురేశ్‌బాబు

పోలీసులు ప్రొఫెషనలిజాన్ని కాపాడుకోవాలి: కేటీఆర్

సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని విమర్శిస్తే పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సురేశ్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకొని క్రూరంగా హింసించారని తెలిపారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వాట్సాప్‌లో పోస్ట్ చేయడమే ఆయన చేసిన నేరమా? అని డీజీపీని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసుల ప్రొఫెషనలిజానికి మంచి పేరు ఉండేదని, అదిపోకుండా కాపాడుకోవాలని సూచించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కొంత మంది పోలీసులను అదుపు చేయాలని స్పష్టం చేశారు.

పోలీసుల తీరును ఖండిస్తున్నాం: హరీశ్

సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకు మాలోత్ సురేశ్‌ను హింసించటం బాధాకరమని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. తొర్రూరు పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, బాధితుడి తల్లి ఆవేదనను అర్థం చేసుకోవాలని, తెలంగాణ డీజీపీ విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోకాల్డ్ కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని విమర్శించారు.

సురేశ్‌బాబుకు అండగా ఉంటాం: ఎర్రబెల్లి

తొర్రూరు, జూలై 11: మాలోత్ సురేశ్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం బాధితుడిని పరామర్శించిన ఆయన.. సురేశ్ కుటుంబసభ్యులను కలిసి అన్నివిధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే మహబూబాబాద్ ఎస్పీకి ఫోన్ చేసి ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే ఆందోళనలు చేస్తామని వెల్లడించారు.

రేపు మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార సభ

- రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం
- ప్రముఖ కవి మోహన్ రుషి, రచయిత పసునూరు శ్రీధర్‌బాబు ఎంపిక
- ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై11 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉద్యమ చైతన్యకెరటం, తెలంగాణ వాగ్గేయకారుడు మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదాన సభను శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నారు. 'ఏమున్న దక్కో..', తలాపునా పారుతుంది గోదారి, పారాని ఆరలేదు చెల్లెలా వంటి అనేక ప్రజాదరణ పొందిన పాటలతో సింగరేణి ప్రాంతంలో ఉద్యమచైతన్యాన్ని రగిలించిన వాగ్గేయకారుడు సదాశివుడు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వాగ్గేయకారుడు మల్లవఝుల సదాశివుడు రాసిన పాటలంటే ఎంతో అభిమానం. వాగ్గేయకారుడు సదాశివుడు స్మారకార్థం తెలంగాణ వికాస సమితి, చేతన సాహితీ సమాఖ్యలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం స్మారకపురస్కారాన్ని అందిస్తున్నాయి. 2022 సంవత్సరానికిగాను సదాశివుడి స్మారక పురస్కారానికి ప్రముఖ కవి మోహన్‌రుషి, 2023 సంవత్సరానికిగాను రచయిత పసునూరు శ్రీధర్‌బాబును ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన రవీంద్రభారతి వేదికగా శనివారం సాయంత్రం 5 గంటలకు పురస్కార ప్రదాన సభ జరుగనున్నది. ఈ కార్యక్రమానికి వక్తగా హైదరాబాద్ సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు హాజరుకానున్నారని తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, చేతన సాహితీ సమాఖ్య వ్యవస్థాపకులు మల్లావఝుల విజయ్ వెల్లడించారు.

ఓయూలో లా కాలేజీ వద్ద బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

మానవతారాయ్ అటెండర్ కాలేడు!

- బీఆర్ఎస్ నేతల గురించి మాట్లాడితే నాలుక కోస్తాం..
- బీఆర్ఎస్వీ నాయకులు స్వామి, సతీశ్ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల గురించి ఇష్టారీతిన మాట్లాడితే నాలుక కోస్తామంటూ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కడారి స్వామి యాదవ్, పడాల సతీశ్ హెచ్చరించారు. ఉస్మానియా విద్యార్థులను అవమానించిన రేవంత్‌రెడ్డి గురించి నీతులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ నేత మానవతారాయ్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం ఓయూలో వారు మాట్లాడుతూ 'మరోసారి బీఆర్ఎస్ నాయకుల గురించి నోటికొచ్చినట్టు మాట్లాడితే బట్టలిప్పి ఆర్ట్స్ కాలేజీ ముందు నిలబెడుతం బిడ్డా ఖబడ్దార్' అని హెచ్చరించారు. మానవతారాయ్‌కి కాంగ్రెస్‌లో కార్పొరేషన్ పదవి కాదు గదా.. ఓయూలో అటెండర్ పోస్టు కూడా దొరకదని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ ముఖ్యనేతలపై మానవతారాయ్, కైలాస్ నేత, చారకొండ వెంకటేశ్ మరోసారి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని చెప్పారు. ఓయూ విద్యార్థులు బీరు, బిర్యానీలకు ఆశ పడుతారని రేవంత్‌రెడ్డి అన్నప్పుడు మానవతారాయ్ ఎక్కడ పడుకున్నాడని నిలదీశారు. 'ఎన్నికల ముందు మూట కోసం బీఆర్ఎస్‌లో చేరి రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్టు మాట్లాడిన నువ్వు ఇప్పుడు నీతులు చెబితే ఎవరూ నమ్మరు' అని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జహీర్‌ఖాన్, జంగం అవినాష్, నూకల యుగంధర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ఎన్ రాజు, జిల్లా నాగయ్య, మిథున్ ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

మంథనిలో మంత్రి అరాచకాలు

- నియోజకవర్గంలో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నరు
- ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నరు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ధ్వజం

మహిళ నిరసన తెలుపుతున్న వీడియోను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అక్రమాలు, అరాచకాలు పెరిగిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. ప్రజలను, ప్రతిపక్ష పార్టీల నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై రౌడీషీట్లు తెరవటానికే సమయాన్ని వెచ్చిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిపై ఓ మహిళ ఫిర్యాదు చేస్తూ 45 రోజులైనా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. మంత్రి తమ్ముడికి ఏ హోదా ఉన్నదని భారీ పోలీస్ రక్షణ కల్పిస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్త సత్యనారాయణ ఇల్లును మంత్రి ఇటీవలే కూలగొట్టించారని, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా పోలీసులు తీసుకోవటం లేదని వాపోయారు. ప్రతిపక్షంలో ఉండా మధిర ఎమ్మెల్యే (డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క) చీటికిమాటికి వచ్చేవారని, ఇప్పుడు మహిళల రోదనలు వినిపించటం లేదా? అని నిలదీశారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నదా? అని ప్రశ్నించారు. ఈ అంశంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

బాలికపై టీచర్ లైంగిక వేధింపులు

- బయటకు రాకుండా మధ్యవర్తులతో రాజీ
- ఆలస్యంగా వెలుగులోకి
- ఉపాధ్యాయుడు సహా పది మందిపై కేసు

బాన్సువాడ, జూలై 11: ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఘటన బయటకు పొక్కకుండా గ్రామ పెద్దలు రాజీ కుదిర్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో ఉపాధ్యాయుడు సహా పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలంలోని ఓ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు.. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన బయటకు పొక్కకుండా స్థానికులు కొందరు మధ్యవర్తులుగా వ్యవహరించి.. ఉపాధ్యాయుడికి, బాలిక తల్లిదండ్రులకు మధ్య రాజీ కుదిర్చారు. తాజాగా ఈ విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో బాధితురాలితో పాటు ఆమె తల్లిదండ్రులతో మాట్లాడగా, లైంగిక వేధింపులు నిజమేనని తేలింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడితోపాటు రాజీ కుదిర్చిన తొమ్మిది మధ్యవర్తులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మద్గుల్‌చిట్టంపల్లిలో మరుగుదొడ్డి గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మరుగుదొడ్డి కాదు.. అంగన్‌వాడీ

- ఇబ్బందుల్లో 10 మంది విద్యార్థులు, టీచర్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వికారాబాద్, జూలై 11: అది ఓ మరుగుదొడ్డి. కాదు.. కాదు.. అంగన్‌వాడీ కేంద్రం. ఇందులో ఏది కరెక్టబ్బా అనుకుంటున్నారా? రెండూ నిజమే! అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో ఆ పక్కనే ఉన్న మరుగుదొడ్డిలోనే కేంద్రాన్ని నడుపుతున్నారు. ఈ దయనీయ పరిస్థితి ఎక్కడో ఉన్నది కాదు.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలోనిది. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లికి 4 కి.మీ. దూరంలో ఉన్న అనుబంధ తండా టేకులబీడులో ఒకేఒక్క పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో ఒకే తరగతి గది ఉంది. అందులో 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆ స్కూల్ ప్రాంగణంలోనే కొన్నేండ్లుగా అంగన్‌వాడీ కేంద్రం కొనసాగింది. దీంతో అటు పాఠశాలకు, ఇటు అంగన్‌వాడీకి తరచూ ఇబ్బందులు తలెత్తడంతో.. అంగన్‌వాడీ భవనం ఏర్పాటు చేయాలని పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు స్పందించడం లేదు. చేసేదిలేక కొన్ని నెలల కింద అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డిలోకి మార్చారు. ఇంత చిన్న గదిలో దాదాపు 10 మంది చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్ కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు.. చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అక్కడే తయారు చేయాల్సి వస్తున్నదని, కొత్త భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ టీచర్ సోనీబాయి వేడుకుంటున్నది.

- వరినారుకు ట్యాంకర్ నీరే దిక్కు

సంగారెడ్డి జిల్లా చౌటకూరుకు చెందిన కౌలు రైతు మన్నె లింగయ్య గ్రామంలోని నాయిని చెరువు కింద ఎకరాకు రూ.10వేలు చెల్లించి మూడెకరాలు కౌలు తీసుకున్నాడు. రూ.6 వేలతో దుక్కులు దున్ని, విత్తనాలకు రూ.3,300, తుకం పోసేందుకు మరో రూ.1000 ఖర్చు చేశాడు. పక్షం రోజులుగా వానలు లేక నారు ఎండిపోతున్నది. దీంతో రూ.2వేలతో ట్యాంకర్ నీరు కొనుగోలుచేసి బతికించుకుంటున్నాడు. ఇప్పటి వరకు నాలుగు ట్యాంకర్లతో నీరు పోయించానని, వర్షాలు పడకుంటే వరి దక్కదని చెమ్మగిల్లిన కండ్లతో చెప్పాడు. సింగూరు జలాలతో చెరువు నింపి నీళ్లివ్వాలని వేడుకున్నాడు.

- సంగారెడ్డి

నిరుద్యోగులకు 5వేల భృతి ప్రకటించాలి

- పరి పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫెయిల్
- మాజీ మంత్రి మోత్కుపల్లి

యాదగిరిగుట్ట, జూలై 11: నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల చొప్పున భృతిని ప్రకటించాలని కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేయాలన్న నిరుద్యోగుల దీక్షపై పోలీసుల దాడి చేయడం బాధాకరమని అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. పరిపాలనలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 సీట్లకే పరిమితం కావడం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోవడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది దళితులు ఉంటే ఒక్కరికి కూడా సీటు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. నీతివంతమైన పాలన సాగించిన తనకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోను తనతో సమానంగా అధికార కార్యాలయాల్లో బిగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశించారని గుర్తు చేస్తూ.. తెలంగాణలోనూ సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అంతే గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- ఎల్కల్‌లో ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఆందోళన

లీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, బలవంతంగా తమ భూములు గుంజుకుంటే భూమికి బదులుగా మరోచోట భూమిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. సర్వే చేయడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. భూములను కోల్పోతే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తంచేశారు. - రాయపోల్

- స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కలెక్టరేట్ల ముట్టడి

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నల్లగొండ, వనపర్తి కలెక్టరేట్లను ముట్టడించారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు బకాయి ఉండటంతో ప్రైవేట్ కళాశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. - రామగిరి/వనపర్తి టౌన్

- కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. నెలనెలా జీతాలు రాకుంటే ఎట్లా బతికేది? అని ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఆకలితో అలమటిస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. - కామారెడ్డి